క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు కురుపాం ఏడీఈ ఎం.రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

9 నుంచి తోటపల్లిలో ధ్యానోత్సవాలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 9, 10, 11 తేదీలలో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు హార్ట్ ఫుల్ నెస్ సంస్థ (శ్రీరామచంద్ర మిషన్), తోటపల్లి టెంపుల్స్ డవలప్‌మెంట్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ సేవా ట్రస్టు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల శిక్షణ తరువాత ఇంటిలోనే ధ్యానం చేసుకోవచ్చునని తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునన్నారు.

పరామర్శ



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

సీతంపేట: మండల పరిధిలోని కె.వీరఘట్టం సర్పంచ్ ఎ.చెంచమ్మ భర్త రమణారావు మంగళవారం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దోనుబాయి సర్పంచ్ వెంకునాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, గేదెల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.సాయికుమార్, బి.అప్పారావు పాల్గొన్నారు.

వాహనాల కోసం జనరల్ పార్కింగ్ ఏర్పాటు చేయండి



ఆర్పీఎఫ్ ఎస్సై ఇగ్నేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురంటౌన్: రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసే వాహనాలకు జనరల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి. దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఇగ్నేష్ కుల్లును కలిసి రైల్వేస్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్‌లో ప్రజల సమస్యలపై వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు తమ వారిని డ్రాప్ చేయడానికి, రిసీవ్ చేసుకోవడానికి, రిజర్వేషన్ల కోసం, రైళ్ల సమాచారం తెలుసుకునేందుకు వచ్చినవారు తమ వాహనాలను తాత్కాలికంగా కొద్ది సమయం స్టేషన్ ముందు ఉంచితే ఇటీవల ఆయా వాహనాలకు గొలుసులతో తాళాలు వేసి, ఫైన్లు వేసి, ఆపై కేసులు పెడుతున్నట్లు పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైల్వేస్టేషన్ ముందు జనరల్ పార్కింగ్ లేకపోవడంతో కొన్ని తరాలుగా వస్తున్న అలవాటు ప్రకారం రైల్వేస్టేషన్ ముందు వాహనాలను పార్క్ చేస్తున్నారన్నారు. కొద్దిసేపు పనుల నిమిత్తం వచ్చినవారు పెయిడ్ పార్కింగ్‌లో తమ వాహనాలను ఉంచలేరని, కాబట్టి జనరల్ పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ నియామకం చేపట్టాలి

పార్వతీపురం టౌన్: 12వ పీఆర్సీ నియామకం చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ కూర్మినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయం వద్దని, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు అమలు చేయాలని కోరారు. సీపీఎస్ టీచర్స్‌కు 90శాతం క్యాష్ డీఏ ఎరియర్స్ మంజూరు చేయాలన్నారు. బకాయిలు, సరెండర్ లీవ్స్, గ్రాట్యుటీ కమ్యూటేషన్ విడుదల చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీపీటీఏ యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్‌టీయూ, శాప్,ఎస్‌టీయూసంఘాలు, ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ అనిల్ కుమార్‌తో పాటు మన్యం జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము, ప్రధాన కార్యదర్శి బి.నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి, కార్యదర్శి కె.సత్యారావు ఉపాధ్యాయులు శుభకర్, రాము, సభ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో, ఉపాధ్యాయ సంఘాలు

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం..



మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్ మంజూరైందని ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ మేరకు యూనిట్‌ను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడానికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. సోషల్ ఉపాధ్యాయుడు కె.సూరిబాబు స్కౌట్ టీచర్‌గా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కర్ర వసుధరాణి, రామునాయుడు పాల్గొన్నారు. - భామిని

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ..



అగ్ని ప్రమాదాల నివారణపై హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఉమావాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. - సీతంపేట

ఒత్తిడి తగదు..



జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి సగటున రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనులు కల్పించాలని ఒత్తిడి చేయడం తగదని మండల సాంకేతిక సహాయకులు వాపోయారు. ఈ మేరకు ఎంపీడీఓ రంగారావును బుధవారం కలిసి తమ సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందించారు. - పాలకొండ రూరల్



గొల్లవీధి కూడలి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



సుబుద్ధిగారి వీధి కూడలిలో పరిస్థితి ఇలా

చెత్తశుద్ధి లేక...



కోమటిపేట వద్ద మూడు రోజులుగా పేరుకుపోయిన చెత్త

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. అధికారిక పర్యవేక్షణ కొరవడడంతో వీధికూడళ్ల వద్ద రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన వీధుల కంటే శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. 20 వార్డులు, 150 వరకు వీధులు గల పాలకొండ పట్టణంలో సుమారు 42 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అయితే పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడం.. డంపింగ్‌యార్డు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఇటీవల వివాహాలు, పలు శుభ కార్యాలు స్థానికంగా జరగడంతో ఆహార వ్యర్థాలు, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. గడిచిన మూడు రోజులుగా కొత్తవీధి, కోమటిపేట, కస్పావీధి, గొల్లవీధితో పాటు కాపువీధుల కూడలి, సుబిద్ధిగారి వీధి ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వార్డుల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పారబోస్తున్నారు. ఎటువంటి అంటురోగాలు ప్రబలకముందే అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూరయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లించకపోవడం వలన వేతనదారులంతా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. దాంతో పాటు పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, తాగునీటి సదుపాయం, టెంట్లు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనదారులకు గుణపాలు, పారలు అందజేయాలని, రెండు పూటల పనిని రద్దు చేయాలని, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజుకు అందజేశారు. ఆ సంఘం నాయకులు పువ్వల ప్రసాద్, మండంగి ప్రభాకరరావు, పత్తిక మోహన్, రమణమూర్తి, సింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు సాధించే వరకూ పోరాటం



ఇళ్ల స్థలాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు, గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ కళాశాల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో నిరుపేదలైన గిరిజనులకు ఇళ్ల స్థలాలు సాధించే వరకూ పోరాటం ఆపేది లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల మంజూరు కోసం వేచి చూస్తున్న గిరిజనులతో కలిసి భద్రగిరి రెసిడెన్షియల్ కళాశాల సమీపంలో ఖాళీ స్థలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్న మాట్లాడుతూ సుమారు 350 మంది ఇళ్ల స్థలాలు లేని గిరిజనులు గతలంలో ఈ ఖాళీ స్థలంలోని తుప్పలు, ముళ్ల పొదలను తొలగించి చదును చేసుకున్నారని తెలిపారు. కొందరు వ్యక్తులు తమ పోరాటాన్ని ముందుకు సాగనీయకుండా వివిధ రూపాల్లో ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. అయినా సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. సీపీఐ నాయకులు సూరయ్య, కుండంగి లింగరాజు పాల్గొన్నారు.

అయ్యరక కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



తోటపల్లిలో సమావేశమైన అయ్యరక కులస్తుల సంక్షేమ సంఘ సభ్యులు

గరుగుబిల్లి: అయ్యరక కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆ సంఘ నాయకులు డి.వైకుంఠనాయుడు, సత్యంనాయుడు, ఎం.వాసుదేవరావు తదితరులు పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో అయ్యరక సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యరక కులస్తులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్నారన్నారు.రాజకీయాలలో కీలక పదవులు పొందేందుకు రాజకీయంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సామాజికంగా వెనుకబడి వున్న అయ్యరక కులస్తులను బీసీ డీ నుంచి నుండి ఏ లోకి మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. పార్వతీపురంలో ఉన్న స్థలంలో అయ్యరకల సామాజిక భవనం నిర్మాణానికి సంకల్పించాలన్నారు. కార్యక్రమంలో డి.రాములు, జి.లక్ష్మినాయుడు, డి.భాస్కరరరావు, వి.మధు, జి.దవళేశ్వరరావు, వి.దాలినాయుడుతో పాటు తుంబలి, కిచ్చాడ, అప్పన్నదొరవలస, అడ్డాపుశీల, కొత్తవలస, కందివలస, తోటపల్లి, కోటిపాం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు చెందిన కులపెద్దలు పాల్గొన్నారు.

నేడు గురివినాయుడుపేటలో కంటి వైద్యశిబిరం

సాలూరు: పాచిపెంట మండలంలోని గురివినాయుడుపేట పీహెచ్‌సీ వద్ద గురువారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి విశాఖపట్నం వారితో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 7287023743 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఆర్పీలు, వీఓఏలకు శిక్షణ తరగతులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం వెలుగు కార్యాలయంలో వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికలపై రెండవ రోజు బుధవారం 13 గ్రామ సంఘాల సీఆర్పీలు, వీఓఏలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పార్వతీపురం వెలుగు ఏపీఎం సన్నిబాబు పేర్కొన్నారు. అనంతరం చినబొండపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు వివరించి అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జి.రమేష్ బాబు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండల ప్రజాపరిషత్ అధికారిగా జి.రమేష్ బాబు (ఎఫ్ఏసీ)బదిలీపై వచ్చారు. ఈ మేరకు బుధవారం అయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన రూపేష్‌కు ఇటీవల బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏఓగా ఉన్న జీవీ రమణ మూర్తి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఇంతవరకు సేవలందించారు.

సహజ ప్రసవంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం



సహజ ప్రసవాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

జియ్యమ్మవలస: సహజ ప్రసవాలపై గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ పూర్ణచంద్రిక అన్నారు. టీకే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్‌కు వెళ్లాలని వీలైనంత వరకు సహజ ప్రసవాలు జరిగేటట్టు చూడాలన్నారు. అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



బీసీ కార్పొరేషన్ రుణం ఇంటర్వ్యూకు హాజరైన దివ్యాంగురాలు

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటి కోసం 46 మంది దరఖాస్తు చేసుకోగా.. వీరికి స్థానికంగా ఉన్న ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీ బ్యాంకులకు చెందిన మేనేజర్లు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి బ్యాంకుల సమ్మతితో రుణాలు అందజేస్తామన్నారు.

రుణం కోసం..

బీసీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా..తనకు వస్తుందో.. రాదోనని దివ్యాంగురాలు చౌదరి కన్నతల్లి ఆవేదన వ్యక్తం చేసింది. నడవలేని స్థితిలో ఉన్నా రెండు కర్రల సాయంతో అతి కష్టం మీద ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చింది. 16 యూనిట్లు మాత్రమే ఉండగా 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. తనకు రుణం వస్తుందో.. లేదోనని ఆందోళన వెలిబుచ్చింది.

ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించండి

- ఎస్సై ప్రయోగమూర్తి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: ఆటో, జీపు డ్రైవర్లు ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని ఎస్సై ప్రయోగమూర్తి అన్నారు. బుధవారం స్థానిక పాలకొండ-వీరఘట్టం రహదారిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్ సీట్ పక్కన, వెనుక వైపు ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. అనంతరం పలు వాహనాలకు చెందిన పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

● అభినందనలు..



వీరఘట్టం మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి గురాన చరణ్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతికి ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో విద్యార్థిని హెచ్‌ఎం వై.లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులున్నారు. - వీరఘట్టం

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ప్రతీ రోజు నిర్ణీత సమయాల్లో చేతులను శుభ్రం చేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. మండలంలోని వల్లరగుడబ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అంగన్‌వాడీ వర్కర్లు అరుణకుమారి, సుజాత బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తినే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ ఉషారాణి పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిషనర్, తదితరులు



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయరంగారావు, తదితరులు

పాలకొండ:

ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. మండలంలోని 32 పంచాయతీలకు ప్రభుత్వం 47 యూనిట్లు మంజూరు చేయగా.. సుమారు 590 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ విజయరంగారావు, ఎంపీపీ బొమ్మాళి భాను, జాడ శ్రీధర్, వాకముడి అనిల్, బి.సుధాకర్, బ్యాంకర్లు దరఖాస్తులు పరిశీలించి, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హుల జాబితా త్వరలోనే ప్రకటిస్తామని ఎంపీడీఓ విజయరంగారావు తెలిపారు.

పట్టణ పరిధిలో 48 యూనిట్లు..

నగర పంచాయతీ పరిధికి మంజూరైన 48 యూనిట్లకు గాను 438 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ జయరామ్, చైర్మన్ పల్లా ప్రతాప్ ఆధ్వర్యంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

నాలుగు యూనిట్లకు 181 మంది..

సీతంపేట: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియ గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. కేవలం నాలుగు యూనిట్లు మంజూరుకాగా.. 181 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కనీసం ఎప్పుడు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారనే సమాచారం కూడా ఇవ్వలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. మిగతా మండలాల్లో పత్రికల ద్వారా దరఖాస్తు గడువు, ముగింపు, ఇంటర్వ్యూ వివరాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ మండలంలో బీసీ రుణాలపై కనీస ప్రచారం కూడా లేకపోవడం గమనార్హం. ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి మాస వద్ద ప్రస్తావించగా గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.